

# విద్యార్థులకు టిఫిన్స్

- నేటి నుంచి సీఎం అల్పాహార పథకం
- ప్రభుత్వ పాఠశాలల్లోఅమలుకు చర్యలు
- పొద్దుగాల విద్యార్థుల పస్తులకు చెల్లు
- పెరగనున్న హాజరు, ఉత్తీర్ణత శాతం
- ఇప్పటికే సక్సెస్‌ఫుల్‌గా మధ్యాహ్న భోజనం
- పేదల కోసం సీఎం కేసీఆర్ వినూత్న పథకం
- ఎమ్మెల్యేలచే ఒక్కో పాఠశాలలో ప్రారంభం
- తల్లిదండ్రుల హర్షం

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ)/జోగుళాంబ గద్వాల : అడక ముందే అన్నీ ఇచ్చే గొప్ప మనస్సున్న ముఖ్యమంత్రి మన రాష్ట్రాన్ని పాలించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నట్లు ప్రజలు ఇప్పటికే కేసీఆర్ పరిపాలనను చూసి హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. దేశంలో ఎక్కడా అమలు చేయలేని విధంగా ఆసరా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్, న్యూట్రిషియన్ కిట్, ఆరోగ్య లక్ష్మి, కంటి వెలుగు, బతుకమ్మ చీరలు, క్రిస్మస్, రంజాన్ తోఫా, రైతుబంధు, రైతు బీమా వంటి పలు పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయి. ఈ క్రమంలో పేదల పిల్లలు చదివే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం కూడా ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా, సకాలంలో పాఠ్య పుస్తకాలు, దుస్తులు అందజేయడం జరుగుతోంది. అలాగే మధ్యాహ్న భోజనం కూడా విజయవంతంగా అమలవుతున్నది. ఇందులో భాగంగా సన్నబియ్యం, రాగిజావ, కోడిగుడ్డు, అరటిపండ్లు అందిస్తున్నారు. ఇక పరీక్షల సమయంలో పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం వేళల్లో స్నాక్స్ కూడా అందిస్తున్నారు. ఇక హాస్టళ్లు, గురుకులాల్లో ఉచిత విద్య, వసతిలాంటి సౌకర్యాలు అమలు చేస్తున్న ప్రభుత్వం తాజాగా అల్పాహార పథకాన్ని తీసుకొచ్చింది.

### పేద విద్యార్థుల ఆకలి తీర్చేందుకు..

పేద విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధి కూలీతోపాటు ఇతర పనులకు పొద్దుగాలనే వెళ్తుంటారు. దీనివల్ల ఉదయం వేళలో చాలా మంది విద్యార్థులు అల్పాహారం తీసుకోకుండా పాఠశాలలకు వస్తున్నారు. మధ్యాహ్నం భోజనం చేసే వరకూ ఆకలితోనే అలమటిస్తున్నారు. దీనివల్ల విద్యార్థులు చదువుపై తగిన శ్రద్ధ చూపించలేకపోవడంతోపాటు తలనొప్పిలాంటి అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. దీంతో విద్యార్థులకు అల్పాహార సమస్యను తీర్చేందుకు సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ ప్రభుత్వమే అల్పాహారం అందించేందుకు నిర్ణయించింది. ఈ పథకంలో భాగంగా ఒకటి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులకు ఉదయం పూట ఉప్మా, పొంగలి, మిల్లెట్లులాంటి అల్పాహారం అందించనున్నారు. దీనిపై విద్యాశాఖ రూపొందించిన మెనూ పాఠశాలలకు చేరింది. దీనివల్ల గ్రామాల నుంచి మండలాలు, పట్టణాలకు వెళ్లే విద్యార్థులకు ఎంతో మేలు చేకూరనుంది. కాలినడకన బస్టాండ్లు, పాఠశాలలకు చేరుకునే విద్యార్థులకు అల్పాహారం మంచి ఆరోగ్యాన్ని అందించనుంది. ఈనెల 24వ తేదీ నుంచి అల్పాహార పథకం ప్రతి పాఠశాలలో అమలు కానున్నది. అయితే అప్పటి వరకు ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉంది. దీంతో ఈనెల 6వ తేదీన లాంఛనంగా పథకాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. విద్యాశాఖకు ఆదేశించడంతో నియోజకవర్గంలో ఒక్కో పాఠశాలను ఎంపిక చేసి ఈ పథకాన్ని ఎమ్మెల్యేల చేతుల మీదుగా లాంఛనంగా ఆరంభించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. ప్రారంభోత్సవంలో విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొనేలా అధికారులు ఇప్పటికే ఆహ్వానాలు అందించారు. జోగుళాంబ గద్వాల నియోజకవర్గంలోని వీరాపురం, అలంపూర్ నియోజకవర్గంలోని ధర్మారం పాఠశాలలో అధికారులు ఈ పథకాన్ని ప్రారంభించడానికి ఏర్పాట్లు చేశారు. పాఠశాల సమయానికి 45 నిమిషాల ముందు విద్యార్థులకు అల్పాహారం అందించనున్నారు. ఈ పథకం వల్ల ఉమ్మడి పాలమూరులో 2,800 ప్రభుత్వ పాఠశాలల్లోని దాదాపుగా 3లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనున్నది. మహబూబ్‌నగర్ జిల్లాలోని 721పాఠశాలల్లోని 67,529మంది విద్యార్థులకు, నాగర్‌కర్నూల్‌లోని 732 పాఠశాలల్లోని 75,922 మందికి, నారాయణపేటలో 496 పాఠశాలల్లోని 64,414 మందికి, వనపర్తిలోని 423పాఠశాలల్లోని 45,283 మందికి, జోగుళాంబ గద్వాలలోని 461 పాఠశాలల్లో చదివే 67,529 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనున్నది.

### అల్పాహారం మెనూ..

| | |
|---|---|
| సోమవారం | గోధుమరవ్వ ఉప్మా, చట్నీ |
| మంగళవారం | బియ్యం రవ్వ కిచిడీ, చట్నీ |
| బుధవారం | బాంబే రవ్వ ఉప్మా, సాంబారు |
| గురువారం | రవ్వ పొంగల్, సాంబారు |
| శుక్రవారం | మిల్లెట్ రవ్వ కిచిడీ, సాంబారు |
| శనివారం | గోధుమ రవ్వ కిచిడీ, సాంబారు, |

కూరగాయల పొలావు, ఆలుకుర్మా, ఇడ్లి, పూరి అదనం..

### పేద విద్యార్థులకు మేలు..



ప్రభుత్వం ఇప్పటికే నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నది. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు చాలా మంది టిఫిన్ చేయకుండా పాఠశాలలకు వస్తున్నారు. ముఖ్యమంత్రి అల్పాహార పథకం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టడం వీరందరికి కడుపు నింపినట్లవుతుంది. పేద విద్యార్థులకు ఈ పథకం వరం లాంటిది.

*- ప్రవళిక, విద్యార్థిని, ధరూర్ ఉన్నత పాఠశాల, గద్వాల జిల్లా*

### రెండు పాఠశాలల్లో ప్రారంభిస్తున్నాం..



ప్రభుత్వం పేద విద్యార్థుల ఆకలి తీర్చడానికి ముఖ్యమంత్రి అల్పాహార కార్యక్రమం పథకాన్ని ప్రారంభిస్తున్నది. జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో రెండు పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతో మంది పేద విద్యార్థులకు మేలు చేకూరనున్నది. ఈ పథకం అమలుతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశమున్నది.

*- సిరాజుద్దీన్, డీఈవో, జోగుళాంబ గద్వాల*

### నేడు అల్పాహార పథకం ప్రారంభం



సీఎం అల్పాహార పథకాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలోని సంజయ్‌నగర్, పెంట్లవెల్లి మండలంలోని కొండూరు, వెల్దండ ప్రాథమి క పాఠశాల, అచ్చంపేట బాలికల ఉన్నత పా ఠశాలల్లో ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలచే లాంఛనంగా ప్రారంభించేందుకు చర్య లు తీసుకుంటున్నాం. ఈ పథకం వల్ల ఉద యం పూట విద్యార్థులకు టిఫిన్ అందించ డం జరుగుతుంది. ఇప్పటికే మధ్యాహ్న భో జనం అమలవుతున్నది. దీనికి అల్పాహారం తోడుకావడంతో విద్యార్థుల గైర్హాజరు తగ్గడంతోపాటు ఉత్తీర్ణత పెరుగుదలపై ప్రభావం చూపిస్తుంది.

*- గోవిందరాజులు, డీఈవో, నాగర్‌కర్నూల్*

# ఎన్నెన్నో వర్ణాలు..

- 25 రంగులు.. 600 డిజైన్లలో..
- ఆడపడుచులకు సర్కారు సారె
- ఊరూవాడా.. ఉత్సాహంగా..
- మొదలైన బతుకమ్మ చీరల పంపిణీ
- ఉమ్మడి జిల్లాలో సిద్ధంగా 9.66 లక్షలు



వనపర్తి మార్కెట్ యార్డులోని గోదాంలో నిల్వ ఉంచిన బతుకమ్మ చీరలను పరిశీలిస్తున్న ఆడిషినల్ డీఆర్‌డీవో రేణుక

మండల కేంద్రాలకు ట్రాక్టర్లలో తరలిస్తున్న బతుకమ్మ చీరలు





వనపర్తి, అక్టోబర్ 5 : నాలుగేండ్లుగా ఆడపడుచులకు దసరా, బతుకమ్మ పండుగల కానుకగా బతుకమ్మ చీరలను ఉచితంగా సర్కారు సారె అందిస్తున్నది. ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను ప్రతియేటా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని వైభవంగా నిర్వహిస్తున్నది. తొమ్మిది రోజుల్లో ప్రతిరోజూ బతుకమ్మను రోజుకో పూలపేరుతో పండుగను చేసుకుంటారు. ఈ ఏడాది ఐదో విడుత కింద అందజేసే బతుకమ్మ చీరలు జిల్లాకు చేరుకున్నాయి. వనపర్తి జిల్లాలో 18ఏండ్లు పైబడిన ఉన్న మహిళలకు ఈ చీరలను అందజేస్తారు. జిల్లాలో మొత్తం 1.83లక్షల మంది మహిళలు ఉన్నట్లు గుర్తించారు. ఇప్పటికే జిల్లాకు 100శాతం చీరలు చేరుకున్నాయి. జిల్లా కేంద్రంలోని పాత మార్కెట్ యార్డులో గల గౌడన్‌లలో బతుకమ్మ చీరలను భద్రపరిచారు. వాటిని ఈనెల 4వ తేదీ నుంచి జిల్లాలోని మహిళలకు ఎక్కడిక్కడ ప్రజాప్రతినిధులు, అధికారులు అందజేస్తున్నారు.

### ప్రత్యేకంగా బతుకమ్మ చీరలు..

రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ చీరలను ప్రత్యేక శ్రద్ధతో ఈ ఏడాది 25 రంగుల్లో, 600 డిజైన్లలో తయారు చేయించింది. గతంలో ఒక బెండ్‌లో ఒకే రకంగా వచ్చేవి. ఈసారి ఒక బెండలో మల్టీపుల్ కలర్స్‌తో వచ్చాయి. ఈ ఏడాది మరింత నాణ్యత,పట్టు చీర మాదిరిగా డిజైన్ చేయబడింది.

### రేషన్‌షాపుల ద్వారా పంపిణీ..

జిల్లాలోని 324 రేషన్ దుకాణాల ద్వారా అక్టోబర్ 4వ తేదీ నుంచి కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ ఆదేశాల మేరకు బతకమ్మ చీరలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే కలెక్టర్ జిల్లాలోని ఆయా మండలాల తాసీల్దార్లతో సమావేశమై సూచనలు, సలహాలు చేశారు. పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని 14 మండలాలు, రెండు మున్సిపాలిటీల్లోని మహిళలకు పంపిణీ చేసేందుకు 1.83 లక్షల చీరలు అవసరమని అధికారులు అంచనా వేశారు. మండలాల వారీగా అమరి చింతకు 9,731, ఆత్మకూర్‌కు 11,837, చిన్నంబావి 9,166, ఘణపురం 12,454, గోపాల్‌పేట 12,741, కొత్తకోట 18,953, మదనాపురం 9,228, పాన్‌గల్ 15,224, పెబ్బేర్ 16,637, పెద్దమందడి 12,448, రేవల్లి 7,140, శ్రీరంగాపురం 6,362, వీపనగండ్ల 8,833, వనపర్తి 32,245 చీరలు అందించనున్నారు.

### చీరలను పంపిణీ చేస్తున్నాం..



జిల్లాకు కావాల్సిన 1.83లక్షల చీరలు ఇప్పటికే జిల్లాకు చేరాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి మండలాన్ని కేటాయించిన కోటాను ఆయా జిల్లాలకు పంపించేందుకు ప్రణాళికలు రూపొందించాం. ఈ ఏడాది బతుకమ్మ చీరలు అద్భుతంగా ఉన్నాయి. చీరలు దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకున్నాం. ఈ నెల 4వతేదీన మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చేతుల మీదుగా మహిళలకు అందజేశాం. జిల్లా వ్యాప్తంగా పంపిణీకి చర్యలు తీసుకుంటున్నాం.

*- నర్సింహులు, డీఆర్‌డీవో, వనపర్తి*

# అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యం

- నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి
- లోకుర్తి, మల్‌రెడ్డిపల్లి, మొగల్‌మడ్క గ్రామాల్లో బీఆర్‌ఎస్ జెండావిష్కరణ

దామరగిద్ద, అక్టోబర్ 5 : ప్రతిఒక్కరూ ఆర్థికంగా ఎదగడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని లోకుర్తి, మల్‌రెడ్డిపల్లి, మొగల్ మడ్క గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతిఒక్కరూ ఆర్థికంగా ఎదగడమే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. లోకుర్తిలో జెండావిష్కరణ అనంతరం 133/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించి మాట్లాడుతూ రైతులను రాజును చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న క్రమంలో రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్, కావాల్సినన్ని ఎరువులు, పంట పెట్టుబడి సాయం అందిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా రైతులు పండించిన పంటలను అమ్ముకోవడానికి అవస్థలు పడకుండా ప్రతి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల వద్దకే వెళ్లి ధాన్యం కొని వారి ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామన్నారు. ఒకప్పుడు గ్రామాలు అంధకారంలో ఉండేవని, నేడు ప్రతిగ్రామంలో వెలుగులు విరజిమ్ముతున్నాయన్నారు. కులవృత్తులకు సాయం అందించి ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. దళితబంధు ద్వారా ఆర్థికసాయం అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అనంతరం మల్‌రెడ్డిపల్లి చెరువులో చేప పిల్లలను వదిలారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడా మైదానాలు ఏర్పాటు చేయడంతోపాటు ఆట వస్తువులతో కిట్లు కూడా అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం సజనాపూర్ గ్రామానికి చెందిన కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను అందించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ భీమయ్యగౌడ్, ఎంపీపీ బక్క నర్సప్ప, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, పీఏసీసీఎస్ అధ్యక్షుడు పుట్టి ఈదప్ప, రైతుబంధు సమితి జిల్లా నాయకుడు వెంకట్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



లోకుర్తిలో బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

# పర్యాటక హబ్‌గా పాలమూరు

- రూ.2,500 కోట్లతో పర్యాటక అభివృద్ధి
- ఐదేండ్లలో పనులు చేపట్టేలా ప్రణాళిక
- ఏడు చోట్ల సస్పెన్షన్ బ్రిడ్జిల ఏర్పాటు
- మన్యంకొండ వద్ద తెలంగాణలోనే తొలిరోప్‌వే
- పర్యాటక, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- ఎనిమిది జిల్లాల్లో 15చోట్ల వర్చువల్ విధానంలో అభివృద్ధి పనుల ప్రారంభం

మహబూబ్‌నగర్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఐదేండ్లలో పర్యాటకరంగం అభివృద్ధికి రూ.2,500కోట్లు ఖర్చు చేశామని, రాబోయే రోజుల్లో తెలంగాణకు విదేశీ టూరిస్టులు వచ్చేలా విభిన్న కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నామని పర్యాటక, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం మహబూబ్‌నగర్ సమీకృత కలెక్టర్ కార్యాలయంలో రూ.125కోట్లతో ఎనిమిది జిల్లాల్లో 15చోట్ల వివిధ అభివృద్ధి పనులకు వర్చువల్‌గా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన మన్యంకొండ వేదికగా ఈ పనులన్నింటినీ ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో పర్యాటక రంగానికి కొత్త హంగులు దిద్దుతూ విదేశీ పర్యాటకులను తెలంగాణకు వచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. గతంలో టూరిజం శాఖకు ఓల్వో, ఏసీ బస్సులు లేకుండేవని, ఈ ఐదేండ్లలో టూరిజంను అభివృద్ధి చేసే చర్యల్లో భాగంగా అత్యధిక బోట్లు, బస్సులు కొనుగోలు చేసి టూరిస్టులకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. తెలంగాణలో ఏకో, మెడికల్, టెంపుల్ టూరిజం అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. మహబూబ్‌నగర్ ఒకప్పుడు వలసల జిల్లాగా పేరుగాంచిందని, ఇక్కడకు రావాలంటే ఆలోచించే వాళ్లన్నారు. ఇవాళ అన్ని రకాలుగా అభివృద్ధి చేయడంతోపాటు తెలంగాణలోనే తొలిరోప్‌వే మణ్యంకొండలో ఏర్పాటు చేయబోతున్నామన్నారు. దేశంలోనే అతిపెద్ద ఎకోపార్కు, పట్టణ సమీపంలో జంగిల్ సఫారీ, పిల్లల మర్రి వద్ద మ్యూజియంతోపాటు కరివెన, ఉదండాపూర్ రిజర్వాయర్లను కూడా పర్యాటక ప్రదేశాలుగా మారుస్తామన్నారు. భవిష్యత్‌లో విదేశీ టూరిస్టులు మన జిల్లాకు వచ్చేలా పర్యాటక రంగాన్ని తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్రంలో సుమారు ఏడు చోట్ల సస్పెన్షన్ బ్రిడ్జిలు ఏర్పాటు చేశామని, మరో నాలుగైదు చోట్ల బ్రిడ్జిలకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. ఆసియాలోనే అతిపెద్ద బుద్ధవనాన్ని తీర్చిదిద్దామన్నారు. త్వరలో ఖమ్మం, కరీంనగర్ జిల్లా కేంద్రాల్లో కూడా డ్రోన్ షోలు నిర్వహిస్తామన్నారు. దేశంలో ఇతర రాష్ట్రాల్లో లేనట్లు పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం వల్ల ఈ ఐదేండ్లలో 1,056 శాతం విదేశీ టూరీస్టుల రాక పెరిగిందన్నారు. రామప్ప టెంపుల్‌ను యునెస్కో గుర్తింపు తీసుకురావడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేశారన్నారు. గతంలో ఉన్న ప్రభుత్వాలు ఈ ఆలయాన్ని పట్టించుకున్న పాపానపోలేదన్నారు. తెలంగాణలో క్రీడా మైదానాలకు సుమారు 10వేల ఎకరాలను కేటాయించి ప్రతి గ్రామంలో నిర్మించడం జరిగిందన్నారు. భవిష్యత్‌తో ఒలింపిక్‌లో అత్యధికంగా తెలంగాణ క్రీడాకారులు పాల్గొనేలా ప్రోత్సహిస్తామన్నారు. అక్కమహాదేవి గుహలను పర్యాటకంగా తీర్చుదిద్దుతామని అన్నారు.



పాలమూరుకు జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు చేస్తూ విడుదలైన జీవోను చూపుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

### పాలమూరుకు ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు..

పాలమూరు జిల్లా కేంద్రంలో జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేస్తు జీవో జారీ చేశారని.. అడిగిన వెంటనే కాలేజీ ఇచ్చిన సీఎం కేసీఆర్‌కు ఎల్లప్పుడూ ఈ ప్రాంత ప్రజలంతా రుణపడి ఉంటారన్నారు. కాలేజీ మంజూరుకు సంబంధించిన జీవో కాపీని మీడియాకు చూపించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో సుమారు 30 ఎకరాల స్థలంలో కాలేజీని ఏర్పాటు చేస్తామని, భవిష్యత్‌లో ఇందులో చదివిన విద్యార్థులు ఇక్కడ ఐటీహబ్‌లోనే ప్లేస్‌మెంట్ ఇచ్చేలా కృషి చేస్తామన్నారు. ఇంజినీరింగ్ కాలేజీ మంజూరుకి సహకరించిన మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్, ఎండీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# మాయమాటల్ని నమ్మితే గోసపడతాం

- కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్, అక్టోబర్ 5 : పేదింటి ఆడబిడ్డల పెండ్లి చేయలేని తల్లిదండ్రుల కష్టాలను తీర్చేందుకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా రూ.లక్షా 116 అందించి సీఎం కేసీఆర్ అండగా నిలుస్తున్నారని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మధ్యాహ్నం కొల్లాపూర్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో స్థానిక ఆర్డీవో నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో చిన్నంబావి, కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, కోడేరు, పెంట్లవెల్లి, వీపనగండ్ల మండలాలకు చెందిన 406 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కింద రూ.4.6 కోట్ల పైచిలుకు చెక్కులు, మరో ఆ రుగురికి దివ్యాంగులకు రూ.50వేల చొప్పున ఐసీడీఎస్ ద్వారా చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అలాగే పీఆర్‌ఎల్ ఐ అంజనగిరి రిజర్వాయర్‌లో ముంపున కు గురైన వడ్డెగుడిసెల నిర్వాసితులకు 110మందికి నివేశన స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీరం మాట్లాడుతూ.. రైతులు వినియోగిస్తున్న కరెంట్ మోటార్లకు మీటర్లు పెడుతామన్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. రైతులకు 3గంటల ఉచిత కరెంట్ చాలన్న కాంగ్రెసోళ్లకు ఓటేస్తే గోసపడుతామని, ప్రజలు ఆలోచించాలని కోరారు. అధికారమే లక్ష్యంగా ఒకాయన కళ్లకు గ్లిజరిన్ రాసుకొని కన్నీళ్లు కారుస్తూ మాయమాటలతో సానుభూతి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించా రు. పాన్‌గల్ మండలంలో ఓ గ్రామానికి ఆసరా పింఛన్లు ఏడాదికి రూ.కోటి వస్తాయంటే సంక్షేమరంగంలో ప్రతిఒక్కరూ లబ్ధి పొందుతున్నారన్నది నగ్నసత్యమన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని సర్కారే కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేస్తున్న రాష్ట్రం దేశంలో తెలంగాణ మాత్రమేనని తెలిపారు. రైతులకు 24గంటల ఉచిత కరెంట్, పెట్టుబడి సాయం, రైతుబీమా, అందిస్తూ రైతులకు అండగా నిలుస్తున్నామన్నారు. జిల్లార్తిప్ప రిజర్వాయర్‌కు నీటిని నింపే శ్రద్ధ చూపకుండా కేవలం ఓట్ల కోసం ఎన్నికల నినాదంగా సమయం గడిపారని మాజీ మంత్రి జూపల్లిని ఉద్దేశించి ఎమ్మెల్యే బీరం విమర్శించారు. ఈ రిజర్వాయర్ పనుల కోసం సీఎం కేసీఆర్ ద్వారా రూ.25 కోట్లు, మల్లేశ్వరం-ఎంగంపల్లి ఎత్తిపోతలకు రూ.18కోట్లు, పెద్దకొత్తపల్లికి ప్రభుత్వ జూనియర్‌కాలేజీ, కొల్లాపూర్‌కు పాలిటెక్నిక్ కాలేజీ మంజూరు చేస్తూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం పట్టణంలోని 16వ వార్డులో రూ.6లక్షల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే బీరం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రంగినేని అభిలాశ్‌రావు, జెడ్పీటీసీ వెంకటరమణమ్మ, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు మతీన్ అహ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీచారి, మహెముదాబేగం, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు రుక్మద్దీన్, కౌన్సిలర్ రాముడుయాదవ్, మాజీ జెడ్పీటీసీ జంబులయ్య, రైతుబంధు సమితి అధ్యక్షుడు నిరంజన్, కమిషనర్ రాజయ్య, ఎంపీపీ భోజ్యానాయక్, సీడీపీవో వెంకటరమణమ్మ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రామచందర్‌యాదవ్, ఈదన్నయాదవ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి